Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 106 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 29 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఎంసీడీ వార్డుల్లో ఉపఎన్నికలను ప్రకటించిన ఈసీ




**న్యూఢిల్లీ:** మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీకి చెందిన 12 వార్డుల్లో ఉప ఎన్నికల తేదీలను ఢిల్లీ స్టేట్ ఎలక్షన్ కమిషన్ మంగళవారం నాడు ప్రకటించింది. నవంబర్ 30న పోలింగ్ నిర్వహిస్తామని, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయని ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఎన్నికల కమిషన్ ప్రకటించిన వివరాల ప్రకారం, ఉప ఎన్నికల కోసం నవంబర్ 3వ తేదీన నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. నవంబర్ 10వ తేదీతో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తుంది. 12న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ నవంబర్ 15తో మగుస్తుంది. నవంబర్ 30వ తేదీ ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ఎలాంటి బ్రేక్ లేకుండా పోలింగ్ జరుగుతుంది.

**బైపోల్ నిర్వహించే వార్డులివే**

ఉప ఎన్నికలు జరుగనున్న వార్డుల్లో ముండ్కా, షాలిమార్ మార్గ్-బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, ద్వారకా-బి, డిచావు కలాన్, నారాయణా, సంగమ్ విహార్-ఏ, దక్షిణ్ పూరి, గ్రేటర్ కైలాష్, వినోద్ నగర్ ఉన్నాయి. షాలిమార్ బాగ్-బి వార్డుకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా గతంలో ప్రాతినిధ్య వహించారు. బీజేపీ కౌన్సిలర్ కమల్‌జీత్ సెహ్రావత్ పశ్చిమ ఢిల్లీ నుంచి లోక్‌సభకు గెలవడంతో ద్వారకా-బి వార్డుకు ఖాళీ ఏర్పడింది. బీజేపీ, ఆప్‌కు చెందిన పలువురు ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేలు కావడంతో తక్కిన వార్డుల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

## అమరావతి - ఏపీపై మొంథా తుఫాను ప్రభావంపై ఆర్టీజీఎస్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

### - సమీక్షకు హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, వి.అనిత, పి.నారాయణ, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం తుఫాను తీరానికి దగ్గరగా వస్తోందని.. కోస్తాంధ్ర జిల్లాలపై దీని ప్రభావం ప్రారంభమైందన్న అధికారులు. కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఉందని చెప్పిన అధికారులు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించిన ముఖ్యమంత్రి. గతంలో వచ్చిన తుఫానుల నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం. తుఫాను తీరం దాటే కాకినాడ, ఆ పరిసర ప్రాంతాలకు రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశాలు. గాలులు, వర్ష తీవ్రతను ముందుగానే అంచనా వేసి అందుకు తగినట్టుగా జాగ్రత్త వహించాలని సూచనలు. విశాఖ, ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సీఎంకు తెలిపిన అధికారులు. ఇప్పటికే తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని వెల్లడించిన సీఎస్.

## సాయంత్రం 5 తర్వాత అన్నీ క్లోజ్ : మంత్రి అచ్చెన్నాయుడు

**కోనసీమ, (రాజధాని వార్తలు):** ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మన చేతిల్లో లేదని... కానీ ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవడం మాత్రం ప్రభుత్వ బాధ్యతని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. తుపాను పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ... పోలీసు, రెవెన్యూ శాఖలతో అనుసంధానమై పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని.. సాయంత్రం ఐదు గంటల తర్వాత రోడ్లన్నీ బ్లాక్ చేస్తామని ప్రకటించారు. భవనాలు కలిగిన వారు పేద కుటుంబాలకు తాత్కాలిక ఆశ్రయం కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారని చెప్పారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు పునరుద్ధరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మంత్రి తెలిపారు. ఎక్కడైనా చెట్లు కూలినా, రహదారులు మూసుకుపోయినా ఎన్డీఆర్ఎఫ్ దళాలు తక్షణమే చర్యలు తీసుకుంటాయని అన్నారు. నర్సాపురం, రాజోలులో తుపాను తీరం తాకే అవకాశం ఉన్న నేపథ్యంలో సాయంత్రం 5 గంటల తర్వాత ప్రజలంతా ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. తుపాను




సమయంలో ఎవరూ బయటకు రాకూడదని హెచ్చరించారు. ఆహారం, పాలు, తాగునీరు అన్ని పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మంత్రి తెలిపారు. రైతాంగం, ఆక్వా రంగం ఆందోళన చెందవద్దని... పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. 'ఇది ఒక విపత్తు.. కానీ మనం కలిసికట్టుగా ఎదుర్కోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపై సీఎం సమీక్ష

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేందుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు, తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆజ్ఞాపించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**సీఆర్ పాటిల్ లేఖపై చర్చ..**

అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై ఈరోజు జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు సీఎం. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్య




యనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితి పైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు

## ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

### - ప్రజలంతా చైతన్యవంతులై అప్రమత్తంగా వ్యవహరించాలి - మంత్రులు, ఎమ్మెల్యేలంతా క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు - ప్రతి 2 గంటలకోసారి ముఖ్యమంత్రి పరిస్థితిని సమీక్షిస్తున్నారు - ప్రధానమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం - మొంథా తుపాను ముందస్తు చర్యలపై మంత్రి నారా లోకేష్



**అమరావతి, (రాజధాని వార్తలు)** మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించాం. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణ నష్టం ఉండకూడదు, ముఖ్యమంత్రి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హోం మంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ.... తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్ మెంట్ మంత్రి అనిత, మరోవైపు ఆర్టీజీఎస్ మంత్రిగా నేను సమన్వయంతో గత 24 గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. గత ఐదు రోజులుగా మొంథా తుపాను గమనాన్ని పరిశీలిస్తూ తుపాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టిసారిస్తున్నాం. ఈ రోజు రాత్రి 11.30 గం.లకు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90 నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది.

**1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 23వ తేదీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. యుఏఈకి వెళ్లే ముందు, అక్కడ నుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్‌లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా తుపాను పరిస్థితులపై సమీక్ష చేశారు. ప్రధాని నరేంద్రమోడీ సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రియల్ టైమ్ రిపోర్టులు పంపించింది. రాష్ట్రానికి ఏం కావాలన్నా సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి చెప్పారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటుచేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించాం. శానిటేషన్ కు అవసరమైన బ్లీచింగ్ పౌడర్, లైమ్, ఇతర సామగ్రిని ఆయా గ్రామాలకు చేరవేశాం.

**ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం**

14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం, 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈ నెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేదాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్డీఆర్ఎఫ్, (మిగతా 2వ పేజీలో)



రాజధాని అమరావతిలో మంజీర స్టార్ హోటల్ నిర్మాణమునకు కేటాయించిన స్థలం రాయపూడి గ్రామ పరిధిలోని E3 సీడ్ యాక్సిస్ రోడ్డులో సీఆర్డీఏ కార్యాలయానికి వెనుక యం యల్ ఏ నివాస భవనాలకు ముందు ఉంది.

ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్

# ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

12 ఎస్డీఆర్ ఎఫ్ టీమ్‌లు, రిజర్వ్ టీమ్‌లు కూడా సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్ లో సిద్ధంగా ఉన్నారు. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్ కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కూడా రెడీగా ఉన్నాయి.

**సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు**

తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు చాలా కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్ ను బట్టి సేవలందించేందుకు 772 రిస్టోరేషన్ టీమ్స్ ను కూడా సిద్ధంగా ఉంచాం. హాస్పటల్స్ కు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైన రోడ్లు కోతకు గురైతే వెంటనే పునరుద్ధరించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. తాగునీటికి సంబంధించి వాటర్ ట్యాంకర్లను రెడీ చేశాం. తుపాను సమయంలో ప్రధానంగా ప్రభావితమయ్యేది సీపీ డబ్ల్యూ స్కీమ్స్. తిత్లీ అనుభవాలతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు, డీజిల్ కూడా అందుబాటులో ఉంచాం.

**రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం కలెక్టర్లందరికీ నిధులు విడుదల చేశాం. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆర్టీజీఎస్ లో రాత్రంతా బసచేసి రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. ముఖ్యమంత్రిగారు ప్రతి 2గంటలకు ఒకసారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మొంథా తుపాను తీరం దాటాక వెనువెంటనే డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్‌తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్ పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం. ప్రభుత్వం ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. దయచేసి ప్రజలంతా ఇళ్లలోనే ఉండండి. బీచ్‌లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దు. అధికారులు చెప్పిన జాగ్రత్తలు పాటించండి. 100 కి.మీ.ల వేగంతో తుపాను వస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బంది పడతాం. ఈ సమయంలో బీచ్ ల దగ్గరకు వెళ్లడం మంచిది కాదు. ఈ రాత్రి 11.30 గంటల నుంచి పరిస్థితి చాలా క్రిటికల్‌గా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల భారీవర్షాలు పడుతున్నాయి. తీరం దాటాక కూడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలోనే...**

ఈ రోజు ఉదయం హోంమంత్రి, నేను ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడాం, వారి వద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంట పొలాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతం చేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈ నెల 23 నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రి ఇప్పటికి 12 సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్డ్‌లోనే ఉన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో సహా మంత్రులంతా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులతోపాటు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. దీనిని తేలిగ్గా తీసుకోకుండా సీరియస్‌గా పనిచేస్తున్నాం.

**ఆర్టీజీఎస్‌లో అవేర్ ప్లాట్ ఫాం**

తుపాను తీరం దాటిన తర్వాత యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తాం. తుపాన్లను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రికి ఎంతో అనుభవం ఉంది. ఆయన 1996 కోనసీమ తుపాను, హుద్ హుద్, తిత్లీ సమయంలో సమర్థవంతమైన సేవలు అందించారు. గత 5 రోజుల నుంచి మేమంతా ప్రిపరేషన్‌లో ఉన్నాం. చెట్లు కూలిపోయినపుడు వాటిని తొలగించే వరకు ఫాలో అప్ మెకానిజం ఏర్పాటు చేశాం. హోం మంత్రి మానిటర్ చేస్తున్నారు. 10 నిమిషాల్లో క్లియర్ చేయాలని సీఎం ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో నేను మాట్లాడాను. అందరూ సిద్ధంగా, అప్రమత్తంగా ఉన్నారు. ప్రమాదం సంభవించకుండా చాలా ప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు తొలగించాం. తుపానుకు సంబంధించి పూర్తిస్థాయి డేటా మాకు ఎప్పటికపుడు వస్తోంది. ఆర్టీజీఎస్‌లో అవేర్ ప్లాట్ ఫాం ఏర్పాటుచేశాం. రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నాం. డిజాస్టర్ మేనేజ్ మెంట్, రిలీఫ్, రిహాబిలిటేషన్ ఇంటిగ్రేషన్ చేస్తున్నాం. వాట్సాప్, ఎస్ఎంఎస్, వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

**అన్ని శాఖలూ సర్వసన్నద్ధం**

సహాయ చర్యల్లో ఎక్కడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 99 శాతం కచ్చితత్వంతో మాకు సమాచారం అందుతోంది. రియల్ టైం సమాచారాన్ని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ప్రధానిమంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. పీఎంఓ వారు కూడా మానిటర్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులంతా తుపాను పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వివిధ రకాల సోర్స్ ద్వారా డేటా సేకరిస్తున్నాం. శాటిలైట్ మ్యాప్స్ కూడా తీసుకుంటున్నాం. ప్రజలను అప్రమత్తం చేసి చైతన్యం తేవడమే మా లక్ష్యం. ఇది రాజకీయాలకు సమయం కాదు. ప్రజలకు సేవలందించేందుకు అన్నిశాఖలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని మంత్రి నారా లోకేష్ చెప్పారు. విలేకరుల సమావేశంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు.

# పంచారామంలో ఎమ్మెల్యే కుటుంబం ప్రత్యేక పూజలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పెద్దాపురం శాసన సభ్యుల నిమ్మకాయల చినరాజప్ప కుటుంబం ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీకమాసం పర్వదినం సందర్భంగా భీమేశ్వర స్వామిని బాలా త్రిపుర సుందరి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుటుంబానికి ఆలయ కార్యనిర్వహణ అధికారి బళ్ళ నీలకంఠం, ఆలయ ధర్మకర్తల మండల్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నంది మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే కుటుంబానికి వేద ఆశీర్వచనం అందజేసారు. అనంతరం ఆలయ అధికారి వారికి శ్రీస్వామివారి ప్రసాదములు, స్వామివారి చిత్రపటం అందజేసియున్నారు.

**భక్తులకు ఇబ్బంది కలగకుండా విస్తృత ఏర్పాట్లు :**

కార్తీక మాసం హిందూ ప్రజలకు అత్యంత పవిత్ర మాసం అయినందున కార్తీక మాసానికి ప్రత్యేకత ఉన్న పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోట భీమేశ్వరాలయానికి రాష్ట్ర ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి దర్శనానికి వస్తారన్నారు. పంచారామక్షేత్రాల సందర్శన యాత్రలో భాగంగా చివరి పంచారామంగా సామర్లకోట భీమేశ్వరాలయాన్ని భక్తులు సందర్శిస్తారు అన్నారు. దానికిగాను చివరగా దర్శించుకునే స్థానిక ఆలయంలో రాత్రి చివరి భక్తుల వరకు దర్శనాలు సజావుగా జరిగే విధంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగినట్టు చెప్పారు. అన్నదాన కార్యక్రమాన్ని భక్తులందరికీ అందే విధంగా ఏర్పాట్లు చేపట్టామన్నారు. భక్తుల రాకకు అనుకూలంగా అధికారులు నెల రోజుల పాటు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల రంగనాగ్, దేవస్థానం చైర్మన్ కంటే జగదీష్ మోహనరావు (బాబు), ధర్మకర్తలు చీమలకొండ వీరభద్ర ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ వంశీ, గొల్తి సత్యనారాయణ, తాతపూడి పవన్ కుమార్, కంచర్ల సుష్మ మోహిని, మందపల్లి భాను వెంకట పద్మ, బాడితి మాని లక్ష్మి, గోనిపాటి బుల్లమ్మ, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార్ స్వామి, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, పైణ్ణి శ్రీనివాస రావు, నిమ్మకాయల కిరణ్, దేవస్థానం అర్చకులు, వేదపండితులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫానులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

## - ఏలేరు పరివాహక ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

**పెద్దాపురం/సామర్లకోట, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలు, ఏలూరు ప్రాజెక్టు నుండి క్రిందికి వదిలిన భారీ జలాల నేపథ్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప ఏలేరు పరివాహక ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. ప్రధానంగా పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో వరద జలాల ఉధృతికి ప్రమాదకరంగా ఉన్న ఏలేరు కాలువలను ఆయన పరిశీలించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు గ్రామాల్లోకి చేరకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై పెద్దాపురం కే శ్రీరాముని ఇరిగేషన్ అధికారులతో ఆయన చర్చించారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ఉన్నటువంటి కుటుంబాలను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రభావం కాకినాడ కోనసీమ జిల్లాలలో అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ తుఫాన్ విషయంలో ఇప్పటికే జాగ్రత్త చర్యలకు



అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఆయా జిల్లాల ఇన్చార్జి మంత్రులను జిల్లాలలో అందుబాటులో ఉంచారన్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల్లో ప్రజల కోసం పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారని, ఎలాంటి సందేశాలున్నా ఆ ప్రాం తాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినందున ఏ సమయంలోనైనా ప్రజలు అధికారుల సహాయం పొందవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఏలూరు పరివాహక ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే అధికారుల బృందం పర్యటించి తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫాను నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మొబైల్ వాహనాల ద్వారా కూరగాయలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మొంథా తుపాను నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా 15 మొబైల్ వాహనముల ద్వారా కూరగాయలను విక్రయించే ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో తుపాను ప్రభావిత ప్రాంతాలకు ఈ మొబైల్ వాహ నములను పంపి ప్రజలకు నాణ్యమైన కూరగాయలను తక్కువ ధరకు అందించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

# నారాయణ కాన్సెప్ట్ స్కూల్ పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని రామలింగాపురం నందుగల నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో సోమవారం పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. 1, 2 వ తరగతి స్టూడెంట్స్ సెగ్మెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమం స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు మొదటి టర్మ్‌లో నేర్చుకున్న Numeracy, Literacy, Rhymes, Stories వంటి అంశాలను తమ తల్లిదండ్రుల ముందు ప్రదర్శించడం. అలాగే పేరెంట్స్ స్వయంగా విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులు Teaching Learning Material (TLM) సహాయంతో సమాధానాలు అందించడం అన్నారు. ఈ విధంగా విద్యార్థులు నేర్చుకున్న విషయాలను సృజనాత్మకంగా ప్రదర్శించగా, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల అభ్యాస ప్రక్రియను దగ్గరగా గమనించే విధంగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ Parent-Student Interaction ప్రోగ్రామ్‌ను సెంట్రల్ ఆఫీస్ నుండి నారాయణ గ్రూప్ డైరెక్టర్ పొంగూరు రమాదేవి నేతృత్వంలో పర్యవేక్షణ బృందం పర్యవేక్షించింది. ఈ కార్యక్రమంలో 1 మరియు 2వ తరగతి విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంగళ రావు, సోనీ, ECHAMPS వైస్ ప్రిన్సిపాల్స్ వెన్నెల, సల్మ, EKidz వైస్ ప్రిన్సిపాల్ బిందు మరియు ఏఓ శివ రంజిత్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది.

# మాధవ్ ఈవెంట్స్ డాన్స్ స్టూడియోను డి పేమ్ జాను లిరి చేతుల మీదుగా ప్రారంభం









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఆదివారం సాయంత్రం మాధవ్ ఈవెంట్స్ డ్యాన్స్ స్టూడియోను ప్రముఖ డాన్సర్ డీ పేమ్ జాను లిరి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరులో బెస్ట్ డ్యాన్స్ స్టూడియో వుందంటే అది మాధవ్ డాన్స్ స్టూడియో అన్నారు తెలుగు రాష్ట్రాలలో మాధవ్ డాన్స్‌తో ఎంతో పేరు సంపాదించారన్నారు. ఎంతో మంది కళాకారులకు ఉపాధికలిస్తూ ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరు మాధవ్ ఈవెంట్స్‌ను ఆదరించాలని కోరుతున్నామన్నారు. మాధవ్ మాట్లాడుతూ తనపై అభిమానంతో తన డ్యాన్స్ స్టూడియో ప్రారంభోత్సవానికి విచ్చేసిన జాను అక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

తనను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు తక్కువ బడ్జెట్ నుండి ఈవెంట్స్ చేస్తామని ప్రతి ఒక్కరు ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

# హోటల్ అసోసియేషన్ ప్రతినిధులందరూ ఐకమత్యంగా ఉండి సమస్యల సాధన కోసం కృషి చేయాలి : రాష్ట్ర హోటల్ అసోసియేషన్ నేతలు పిలుపు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** హోటల్ అసోసియేషన్ ప్రతినిధులందరూ ఐకమత్యంగా ఉండి సమస్యల సాధన కోసం కృషి చేయాలని రాష్ట్ర హోటల్ అసోసియేషన్ నేతలు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని డిఆర్ ఉత్తమ హోటల్లో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ నాయకులు జి శ్రీనివాసరావు ప్రెసిడెంట్, రమణ, హానరరీ సెక్రటరీ, కొండయ్య ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ, లక్ష్మీనారాయణ ట్రెజరర్, శ్రీకాకుళం వినోద్ తదితరులు నెల్లూరు జిల్లా హోటల్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నెల్లూరు జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. నెల్లూరు జిల్లా హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, మురళీకృష్ణ పిక్నిక్ ఐస్ క్రీమ్స్ అధినేత వీరిశెట్టి హాజరత్ బాబు, డిఆర్ ఉత్తమ హోటల్ అధినేత ధనుంజయ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పలువురు నెల్లూరు జిల్లా హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.

# మొంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో అధికారులు అందుబాటులో ఉండాలి


**- ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి సహాయ శిబిరాలు ఏర్పాటు చేయండి**
**- సహాయ శిబిరాల్లో ఆహారం, నీరు సిద్ధంగా ఉంచండి - ఆకస్మిక వరదలు వస్తే పెన్నానది పొర్లుకట్టలు, చెరువు గట్లు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలి**
**- అత్యవసర పరిస్థితులలో కూటమి పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు సహాయ చర్యలకు సన్నద్ధం కావాలి - ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుంటూ ముందస్తు చర్యలపై అధికారులు, నాయకులకు సూచనలు అందిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మొంథా తుపాను తీరం దాటే వరకు తీర ప్రాంత మత్స్యకారులు మరియు పెన్నా నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. తుఫాను తీవ్రత నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుంటూ చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులు మరియు నాయకులకు సూచనలు సలహాలు అందిస్తున్నారు. తుఫాను తీరం దాటే సందర్భంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అందుబాటులో ఉండి నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైతే ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది రాకుండా చూడాలని కోరారు. సహాయ శిబిరాల్లో ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా జనరేటర్లు సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు వస్తే పెన్నా నది పొర్లు కట్టలు మరియు చెరువు గట్లకు గండ్లు పడే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూటమి పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు సహాయ చర్యలకు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. తుఫాను నేపథ్యంలో తీర ప్రాంత మరియు పెన్నా పరివాహక గ్రామాల ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటుందని ఎవరు ఆందోళన చెందవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతో సంప్రదిస్తూ పరిస్థితిని సమీక్షిస్తున్నారన్నారు. తుఫాన్ ముప్పు ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అత్యవసర సహాయం కోసం జిల్లా కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్ నంబర్లను 0861–2331261 – 79955 76699 సంప్రదించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు సూచించారు ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వివరించారు.

# ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలి

**- నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను పరిశీలించిన జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను నేపథ్యంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని కంట్రోల్ రూమ్‌లో పని చేస్తున్న సిబ్బందిని జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ ఆదేశించారు. సోమవారం మొంథా తుఫాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు నియమించిన ప్రత్యేకాధికారి యువరాజ్ అధికారులతో సమీక్షాసమావేశానికి ముందు ప్రజలకు సహాయం అందించేందుకు నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లతో కలిసి జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సహాయం కోసం ప్రజలు ఫోన్ చేసిన వెంటనే స్పందించాలని, సమస్యను పూర్తిగా తెలుసుకుని సంబంధిత అధికారులకు తక్షణమే సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా మాట్లాడుతూ..జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూంతో పాటు కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, నెల్లూరు, కావలి, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని..భారీవర్షాలకు సంబంధించి ఏద్కెనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూమ్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చని ప్రజలకు సూచించామని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్ల ప్రత్యేక అధికారి యువరాజ్‌కు తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయంతో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్లు. నెల్లూరు జిల్లా కలెక్టరేట్ కంట్రోలు రూం నెంబర్లు : 0861 2331261, 7995576699. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, : 7601002776. ఆర్డీవో కార్యాలయం, నెల్లూరు : 9849904061. ఆర్డీవో కార్యాలయం, ఆత్మకూరు : 9100948215. ఆర్డీవో కార్యాలయం, కావలి : 7702267559.

# గిరిజనులకు అండగా ఉంటామన్న అధికారులు




**డక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డక్కిలి మండలం అత్తల సిద్దవరం గిరిజన గ్రామాన్ని డక్కిలి మండలం తాహిసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో రవీంద్రబాబు, సబ్ ఇన్స్పెక్టర్ శివశంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మొంథా తుఫాన్ ప్రభావంతో అధికంగా వచ్చే పరిస్థితి ఉన్నందువలన మీరంతా సురక్షితంగా అప్రమత్తంగా ఉండాలన్నారు, గిరిజన గ్రామం నుండి సమీప అల్తురుపాడుకు గ్రామానికి రావాలన్న సుమారు ఐదు కిలోమీటర్లు అడవిలో ప్రయాణించే పరిస్థితి ఉందని బండి పాట తప్పిస్తే ఎలాంటి రహదారి లేనందువలన పైగా దారి మధ్యలో మూడు పెద్ద కొండవాగులు ఉన్నాయని అధిక వర్షం వస్తే గ్రామం నుండి బయటకు వచ్చే పరిస్థితి ఉందని విషయాన్ని గ్రహించమని, గ్రామంలో 32 కుటుంబాలు జీవిస్తున్నాయని మీరంతా నిత్యవసర సరుకులు, టార్చ్ లైట్ లు, ఫోన్లకు రీఛార్జి ఉంచుకోవాలన్నారు, ఏదైనా అత్యవసర పరిస్థితి ఉందనుకుంటే గ్రామంలోని అందరికీ ఆల్తురుపాడు లేదా డక్కిలిలో పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. పలు సమస్యలపై గిరిజన ప్రజలు మండల అధికారులకు మొరపెట్టుకొని పరిష్కరించమని వారిని ప్రాధేయపడ్డారు.

# మొంథా తుఫాన్‌కు తీసుకోవలసిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ నేపథ్యంలో నెల్లూరు నగరంలో ముందస్తు చర్యలు అన్ని చేపట్టాం. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కమిషనర్ వై.ఓ.నందన్. ఇప్పటికే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు కమిషనర్ మొంథా తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై అన్ని విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాము. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొంథా తుఫాన్‌పై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా ,ఎప్పుడూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం అందుబాటులో ఉంటుంది. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పై కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నందిమండలం భాను, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్, కార్పొరేషన్ ఎస్.ఇ., డి.ఇ., ఎ.ఇ.లు, ఎలక్ట్రికల్ ఎ.డి., ఎ.ఇ.లు, ఇరిగేషన్ ఏ.ఈ., తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి : ప్రత్యేక అధికారి రమేష్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మోంథా తుఫాన్ ప్రభావం రానున్న రెండు రోజుల్లో మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఎం.రమేష్ సూచించారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయ ఆవరణంలో సోమవారం ఆయన మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు తుఫాన్ ప్రభావం, తీసుకోవాల్సిన చర్యల పై పలు సూచనలు చేశారు. గజపతినగరం ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్, బజారు వీధిలోగల ఏఎస్ఎన్ఎం ఎంపీపీ స్కూల్‌లలో రెండు పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మామిడి బంద కాలనీ, సంతతోట కాలనీ ప్రజలను ఈ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అలాగే వ్యవసాయ అధికారులు రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించే విధంగా ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పశు వైద్య అధికారులు, హార్టికల్చర్ అధికారులకు కూడా సూచనలు చేశారు. చెరువులకు గండ్లు పడిన వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు అందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలను కూడా అప్రమత్తత చేయాలన్నారు. తాసిల్దార్ కార్యాలయం తో పాటు పలు మండల స్థాయి అధికారులు కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. కళ్యాణి, తాసిల్దార్ బి. రత్నకుమార్, వివిధ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# బాలలకు కృత్రిమ మేధ అవసరమా

వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో పాఠశాల విద్యలో మూడవ తరగతి నుంచి కృత్రిమ మేధ (ఏఐ) పాఠ్యాంశాలను ప్రవేశపెట్టనున్నట్టు కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ప్రకటించింది. డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణతో రూపొందే ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా భావి శ్రామికశక్తిని తీర్చిదిద్దే లక్ష్యంతో పాఠశాల స్థాయి నుంచి ఏఐ పాఠ్య ప్రణాళికను అమలు పరచనున్నట్టు కేంద్రం వెల్లడించింది. ఈ నిర్ణయాన్ని అనుసరించి రాష్ట్రాల విద్యా మంత్రిత్వశాఖలు కూడా ఏఐ పాఠ్య ప్రణాళికలను రూపొందించేందుకు పూనుకున్నాయి. విద్యార్థులకు ఏఐ పరిజ్ఞానాన్ని బోధించేందుకు కేంద్ర ప్రభుత్వం జూలై 2025లో 'SOAR Initiative (Skilling for AI Readiness)'ను ప్రారంభించింది. దీని ద్వారా సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్)కు అనుబంధంగా ఉన్న దాదాపు 18 వేల పాఠశాలల్లో ఆరవ తరగతి నుంచి ఏఐను ఒక 'నైపుణ్య విషయం'గా బోధిస్తున్నారు. 6, 7, 8 తరగతులకు మూడు విభిన్న '15 గంటల' బోధనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కృత్రిమ మేధపై బాలలకు అవగాహన కలిగించడం, దానిని ఆచరణాత్మకంగా అనువర్తింపచేయడం, ఏఐ వినియోగంలో ఉత్పన్నమయ్యే సామాజిక చిక్కులను పిల్లలు అర్థం చేసుకోవడమే ఈ కార్యక్రమాల లక్ష్యంగా ఉన్నది. ఇక 9, 10, 11, 12 తరగతులకు '150 గంటల' ఎలెక్టివ్ కోర్సుల (విద్యార్థులు తమ వ్యక్తిగత ఆసక్తులు, భావి వృత్తి జీవిత లక్ష్యాలు లేదా తమ ప్రధాన పాఠ్యాంశాలతో సంబంధం లేకుండా కొత్త విషయాలను అధ్యయనం చేయడం ఆధారంగా ఎంచుకునే ఐచ్ఛిక కోర్సులు)ను బోధిస్తున్నారు. చాలా కొద్ది విశ్వవిద్యాలయాలు ఈ ఏడాది సైన్స్, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏఐ కోర్సులను తప్పనిసరి చేశాయి. సమస్త విద్యా విభాగాలకు ఏఐ బోధన తప్పనిసరికాదు. కనుక ఆలోచనాపరులు ఒక ప్రశ్న అడిగి తీరాలి: పాఠశాలల్లో ఏఐ బోధనకు ఇంత తొందర ఎందుకు? కృత్రిమ మేధ మన జీవితాలను పలు విధాలా ప్రభావితం చేయనున్నదనడంలో సందేహం లేదు. 'ప్రపంచ ఏఐ ప్రమాణాలను రూపొందించడంలోను, ఏఐ సాంకేతికతల అభివృద్ధి, అనువర్తనాలలోను ప్రధానపాత్ర వహించాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దీనిపై ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. అయితే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏఐ బోధన తప్పనిసరా? డిజిటల్ అంతరాలను తగ్గించేందుకు, గ్రామీణ ప్రాంతాల, వనరులు తక్కువగా ఉన్న సామాజిక వర్గాల విద్యార్థులకు అవకాశాలను అందించేందుకు 'SOAR Initiative' ఇతోధికంగా తోడ్పడుతుందని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డిజిటల్ సాధనాలను ఉపయోగించనివారు, అసలు వాటిని ఎలా ఉపయోగించాలో తెలియని విద్యార్థులు, ఉపాధ్యాయులే మన విద్యారంగంలో అత్యధికంగా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో డిజిటల్ అంతరాలను తగ్గించడమనే లక్ష్యం నెరవేరుతుందా? ఒక సాదృశ్యంతో ఈ విషయాన్ని మరింత వివరంగా పరిశీలిద్దాం. గత మూడు దశాబ్దాలుగా మొబైల్ ఫోన్ మన జీవితాలను అనేక రీతుల్లో అమితంగా ప్రభావితం చేస్తోంది. మన వైయక్తిక జీవితాలనే కాకుండా సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను మౌలికంగా మార్చివేసింది. అంతమాత్రాన 'మొబైల్ ఫోన్ ఎలా పనిచేస్తుంది?' అనే అంశాన్ని బాలలకు మూడవ తరగతి నుంచే బోధించి తీరాలా? మొబైల్ ఫోన్‌ను ఉపయోగించాల్సిన తీరుతెన్నులను పాఠశాల బాలలకు బోధించాలి. అయితే ఎప్పుడు? ఆ సాంకేతికతను మెరుగ్గా అర్థం చేసుకుని, ఉపయోగించుకోగల సామర్థ్యాన్ని అలవరచుకున్నప్పుడు. భద్రంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడాన్ని బాలలకు పాఠశాలలు నేర్పాలి. అది సమకూర్చే విద్యా ప్రయోజనాలను బాలలు పొందగలిగేలా చూడాలి. 'పాఠశాలల్లో ఏఐ బోధన' అనే మాటను పలువురు పలు విధాలుగా ఉపయోగిస్తున్నారు. ఉద్దేశించిన అర్థాల వెనుక ఉన్న గణనీయమైన గందరగోళాన్ని ఆ మాట దాచిపెడుతోంది. 'ఏఐ అక్షరాస్యత' అని కొంత మంది అస్పష్టంగా నిర్వచిస్తుండగా మరికొంత మంది తరగతి గదుల్లో ఏఐ సాధనాలను మరింత ఎక్కువగా ఉపయోగించాలనే అర్థంలో ఆ మాటను వాడుతున్నారు. ఉపాధ్యాయుల బోధనా కౌశలాలు, ఇతర విధుల నిర్వహణా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఏఐను ఉపయోగించుకోవాలనే అర్థంలో వాడుతున్నారు. వ్యక్తిగతీకరించిన అభ్యాసం గురించి ఏఐని అభివృద్ధిపరుస్తున్న నిపుణులు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యక్తిగత విద్యా పురోగతి గురించి మాట్లాడుతోంది. ఈ అయోమయ పరిస్థితిలో సమగ్ర అవగాహనతో ఏఐ సాధనాలను ఉపయోగించడాన్ని బాలలకు ఏఐని బోధించడం నుంచి తప్పనిసరిగా వేరు చేయాలి. ప్రస్తుతం అమలు పరుస్తున్న ఏఐ పాఠ్య ప్రణాళికను నిశితంగా పరిశీలిద్దాం. ప్రాథమికోన్నత పాఠశాల ఏఐ పాఠ్య ప్రణాళిక మూడు ఏఐ సాంకేతిక విభాగాలను ప్రవేశపెట్టింది. అవి: కంప్యూటర్ విజన్, సహజ భాషా ప్రాసెసింగ్, స్టాటిస్టికల్ డేటా. ఏడవ తరగతి పాఠ్యపుస్తకం సుస్థిరాభివృద్ధికి పరిస్థితులను అనుకూలపరచడంలోను, సామాజిక అభివృద్ధి సాధనలోను ఏఐ వినూత్న పాత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావించింది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, సిస్టమ్స్ థింకింగ్ (సమస్యల పరిష్కారానికి సమగ్రమైన రీతిలో ఆలోచించడం), సిస్టమ్స్ మ్యాప్స్ (ఒక సంక్లిష్ట వ్యవస్థ భాగాలు ఎలా పరస్పరం అనుసంధానమై ఉన్నాయో వివరించే దృశ్య ప్రాతినిధ్యాలు) మొదలైన భావనలకు కూడా ప్రాధాన్యమిచ్చింది. 8వ తరగతి విద్యార్థులు 'ఏఐ ప్రాజెక్టులు', 'ఏఐ నైతికత, బాధ్యతాయుతమైన ఏఐ ఆచరణలు' గురించి నేర్చుకుంటారు. 9వ తరగతి పుస్తకం ఏఐకు అవసరమైన గణితం, జెనరేటివ్ ఏఐ గురించి చర్చించింది.

# మోంథా తుఫాన్ నేపథ్యంలో అనునిత్యం అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**- ఎలాంటి పరిస్థితి ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపు - గజపతినగరం నియోజక వర్గ క్షేత్ర స్థాయి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా రివ్యూ చేసిన మంత్రి**






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మోంథా తుఫాను తీవ్ర రూపం దాల్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో గజపతినగరం నియోజకవర్గంలోని క్షేత్రస్థాయి అధికార యంత్రాంగం అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితులు ఏదురైనా ఎందుర్కోనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన మోంథా తుఫాన్ క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో గజపతినగరం నియోజకవర్గం అధికారులతో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి భారీ వర్షాలు, వరదలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. కమ్యూనికేషన్, విద్యుత్, వైద్య, ఆరోగ్య, రోడ్లు భవనాల శాఖ అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. భారీ గాలులకు చెట్లు, విద్యుత్ స్థంభాలు విరిగి పడే అవకాశం ఉన్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కాలవలు, చెరువుల సమీపంలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో దండోరాలు వేయించి ప్రజలను హెచ్చరించాలని సూచించారు. అంబులెన్స్ లను, అత్యవసర వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేసారు. విపత్తు సమయంలో అధికారుల మధ్య సమన్వయం ఎంతో కీలకమని, అందరూ కలిసి, ప్రజల కోసం పని చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు సమాచారాన్ని వీలైనంత వేగంగా చేరవేయాలని మంత్రి ఆదేశించారు. గర్భిణీ స్త్రీలను ముందుగానే ఆసుపత్రిలో చేర్చాలని మంత్రి సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. వీలైనంత త్వరగా ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్లను వినియోగించుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. టోల్ ఫ్రీ నెంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో తుఫాను ప్రత్యేక అధికారి టి విమలా రాణి, ఎమ్మార్వో హరికిరణ్, ఎండిఓ ప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొనగా, గజపతినగరం, గంట్యాడ, బొండపల్లి, జామి మండలాల యం ఆర్ ఓ లు, యం డి ఓ లు గూగుల్ మీట్ వెబ్ ఎక్స్ ద్వారా మీటింగ్‌లో పాల్గొన్నారు.

# మండల డెవలప్మెంట్ అధికారికి వినతి పత్రం ఇచ్చిన బొబ్బేపల్లి



**మనుబోలు, (రాజధాని వార్తలు):** డిప్యూటీ సీఎం పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు సర్వేపల్లి నియోజకవర్గంలోని మోతుకూరు మండల డెవలప్మెంట్ అధికారికి గిరిజనుల సమస్యపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది బ్రహ్మదేవం పంచాయతీ నందు ఈదరోల్లపాలెం గిరిజన కాలనీలో గత ప్రభుత్వం నిర్మాణం చేసిన ఇళ్లకి కనీసం వాళ్లు నడిచేందుకు మట్టి తోలి మట్టి రోడ్డు కూడా నిర్మాణం చేసినటువంటి పరిస్థితి లేదు కోట్ల రూపాయలు విలువ చేసే గ్రావెల్ దందాన్ని నిర్వహించి గ్రావెల్ దోచుకొని కరోనా ప్యాలెస్ కట్టుకున్న కాకాణి నీకు పేద గిరిజనులంటే కనికరం కూడా లేదు నేడు ఓడిపోయిన బాధలో ఉండవో ఓడిపోయినందుకు మైండ్ పనిచేసినట్లు లేదని ఇష్టానుసారంగా నోరు ఉంది కదా అని ప్రతిరోజు ఒక మీడియా సమావేశం పెట్టి కుటమీ ప్రభుత్వాన్ని నిందించడం. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని వాళ్ళ కొడుకుని నిందించడం తప్ప గత ఐదేళ్లు ఈ సర్వేపల్లి నియోజకవర్గంలో నువ్వు ఏమి అభివృద్ధి చేసావో చూపించు నువ్వు దోచుకున్న దానికి ఆనవాళ్లు మేం చూపిస్తాం అవినీతి చేయడంలో నీకంటే సిద్ధహస్తులు ఎవరున్నారు ఈ రాష్ట్రంలో నువ్వు అబద్దాలు చెప్పడంలో మాఫియా చేయడంలో అమాయకులని బెదిరించడంలో భూములను ఆక్రమించడంలో నీకు మించిన అవినీతిపరులు ఈ రాష్ట్రంలో ఎవరూ లేరు. కూటమి ప్రభుత్వం పేదలకు అందుబాటులో గిరిజన కాలనీల అభివృద్ధిలో ఎప్పుడూ కూడా ముందుంటుంది ప్రభుత్వ అధికారులందరూ కూడా రాజ్యాంగబద్ధంగా ప్రజల కోసం పనిచేస్తున్నారు ఈ విషయం గుర్తుపెట్టుకొని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఇంకా బలంగా ఉండి గ్రామాలని అభివృద్ధి చేస్తుంది. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, సందురి శ్రీహరి, స్థానిక గిరిజనలు పాల్గొన్నారు.

# తుపాన్ ప్రభావం రైతు తగు జాగ్రత్తలు తీసుకోవాలి : డా.జి.లలితా శివజ్యోతి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను ప్రభావంతో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నెల్లూరు జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా.జి. లలితా శివజ్యోతి సూచించారు. ఉరుములు, మెరుపులు మరియు బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున పక్వ దశలో ఉన్న కూరగాయలు, ఉద్యాన పంటలను తక్షణమే కోయాలని, అరటి వంటి తోటల్లో మొక్కలకు సరైన ఊతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున పశువులు, మేకలను సురక్షిత ప్రదేశాల్లో ఉంచి మేత అందించాలన్నారు. కోత దశలో ఉన్న వరి పంటలో అధిక వర్షాల కారణంగా వరి గింజలు రాలిపోవడం, మొలకెత్తడం మరియు రంగు మారడం వంటి నష్టాలు తగ్గించేందుకు లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారి చేయాలని సూచించారు. సజ్జ పంట కోసి పొలాల్లో ఉంచినప్పుడు 2% ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 20 గ్రాములు ఉప్పు) పిచికారి చేయడం ద్వారా బూజు మరియు గింజలు మొలకెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. కంది పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు తీయాలని, 1% 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. మారుకా కాయ తొలుచు పురుగు నివారణకు వర్షం ఆగిన వారం తరువాత క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీ లేదా నోవాల్యురాన్ 1 మి.లీ/లీ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. మినుము, పెసర పంటల్లో నీరు నిలిచిన పొలాల్లో నీటిని తొలగించి, ఇనుము లోపాన్ని సరిచేయడానికి లీటరు నీటికి ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రా, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రా, యూరియా 20 గ్రా కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఒక వారం తరువాత 1% 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలని చెప్పారు. వేరుకుళ్ళు మరియు ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనజో 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. నారు మడి వేయుచున్న రైతులు వర్షాలు తగ్గిన తరువాత మాత్రమే వేయాలని తెలిపారు. వరి విత్తనాలను కిలోకు మూడు గ్రాముల కార్బండెజిమ్ (50%) మందుతో శుద్ధి చేసి 24 గంటల తరువాత నారుమడిలో చల్లాలని సూచించారు. దంప నారుమడిలో వేయాలనుకుంటే లీటరు నీటికి ఒక గ్రాము కార్బండెజిమ్ (50%) కలిపి విత్తనాలను 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన విత్తనాలను వేయాలని తెలిపారు. అలాగే కార్బండెజిమ్ (25%) మరియు మాంకోజెబ్ (50%) మిశ్రమ శిలీంధ్రనాశనాన్ని కిలో విత్తనానికి రెండు గ్రాములు లేదా లీటరు నీటికి ఒక గ్రాము వంతున వాడవచ్చని సూచించారు. రైతులు పంటల పరిస్థితిని రోజువారీగా గమనించి, వాతావరణ శాఖ మరియు వ్యవసాయ శాఖ ఇచ్చే తాజా సూచనలను తప్పనిసరిగా పాటించవలసిందిగా తెలిపారు.

# కరప మండలంలో వరి పంటకు వర్షాల ముప్పు

**- 20 ఎకరాలు నీటమునిగి భారీ నష్టం**
**- అధికార యంత్రాంగం చర్యలు**




**కరప, (రాజధాని వార్తలు):** నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కరప మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల వరి పంటలు తీవ్ర నష్టానికి గురయ్యాయి. ముఖ్యంగా జెడ్ భావారం గ్రామానికి చెందిన రైతులు కోపిశెట్టి వెంకటరమణ, పెంకె గోవిందు, పితాని నాగరాజు, మేడిశెట్టి సత్తిబాబు తదితరులు సాగు చేసిన సుమారు 20 ఎకరాల వరి పంట పూర్తిగా నీటమునిగి నష్ట పోయిందని బాధిత రైతులు వెల్లడించారు. రైతులు తమ సమస్యలను కూటమి నాయకుల ద్వారా కాకి నాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే తక్షణమే సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కరప మండల డీసీ చైర్మన్ పుణ్యమంతుల గంగా సత్యనారాయణ (పీజీ) పర్యవేక్షణలో సోమవారం ఉదయం నుంచే వ్యవసాయ డ్రైనేజీ కాలువల్లోకి చేరిన నీటిని తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. జెసీబి యంత్రాల సాయంతో గుర్రుడెక్కల తొలగింపు పనులను అధికారులు సంప్రదాయ పద్ధతిలో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

**మొంథా తుఫాను ముందు జాగ్రత్తలు..**

ముందస్తు తుఫాను హెచ్చరికల దృష్ట్యా మరిన్ని నష్టాలు సంభవించకుండా పాతర్లగడ్డ వెంకటప్పయ్య కాలువలో డ్రైనేజీ పనులు వేగవంతం చేస్తున్నట్లు డీసీ చైర్మన్ గంగా సత్యనారాయణ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కార దిశగా అధికారులు చురుకుగా స్పందించాలని పిలుపునిచ్చారు. తమ విజ్ఞప్తికి తక్షణ స్పందనతో ముందుకొచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన సహకారం పట్ల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

# పూడికతీత పనులు పరిశీలించిన డిసిసిబి చైర్మన్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** తుఫాను కారణంగా పడనున్న భారీ వర్షాలు నేపథ్యంలో సామర్లకోట–కాకినాడ కెనాల్ రోడ్డులో కాలువల్లో పూడుకుపోయిన గుర్రపు డెక్కల వల్ల వర్షం నీరు వెళ్లడానికి ఆటంకం అవుతుండగా పూడికతీత పనులను చేపట్టారు. కూటమి నాయకులు చొరవతో పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండలం వి.కె.రాయపురం గ్రామం వద్ద ఉన్న కెనాల్‌లో పెరిగిపోయిన పూడిక, గుర్రపుడెక్క తొలగింపు పనులను డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పరిశీలించారు. ప్రభుత్వ అధికారులు పనిచేస్తున్న తీరును ఆయన పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వర్షాలు అధికమవకుండానే పూడికతీత పనులు పూర్తి చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికె.రాయపురం కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కుమ్మరి చెరువు జలాలు విడుదల




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** భారీ వర్షాల నేపథ్యంలో పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఐదవ వార్డ్‌లో ఉన్న కుమ్మరి చెరువులోని జలాలను అధికారులు డ్రైన్లలోకి విడుదల చేశారు. అధిక జలాలతో నిండుకొని ఉన్న కుమ్మరి చెరువును సోమవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. రానున్న తుఫాన్ కారణంగా చెరువులోనికి అధిక జలాలు చేరే అవకాశం ఉన్నట్టు గుర్తించి ప్రస్తుతం ఉన్న జలాలను అవుట్ లెట్ ద్వారాలను తెరిచి మేజర్ డ్రైన్‌ల గుండా బయటకు పంపించారు. అలాగే చెరువుకు పరిసర ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలను అధికారుల అప్రమత్తం చేస్తూ పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్, మున్సిపల్ ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘాటికే రాలేదు.. బాహుబలికి వస్తుందా అత్యాశనే..?



బాహుబలి రెండు భాగాలు కలిపి బాహుబలి ఎపిక్ అంటూ ఒక సినిమాగా రిలీజ్ చేస్తున్నారు. బాహుబలి రెండు సినిమాల ఎక్స్ పీరియన్స్‌ని ఒకే సినిమాగా ఇవ్వబోతున్నారు. 10 ఏళ్ల తర్వాత కూడా బాహుబలి మీద ఆడియన్స్‌లో ఉన్న బజ్‌ని క్యాష్ చేసుకునేందుకు బాహుబలి ఎపిక్ వస్తుంది. ఈ నెల 31న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌ని భారీగానే ప్లాన్ చేస్తున్నారు రాజమౌళి. బాహుబలి ఎపిక్ కోసం ఇప్పటికే రాజమౌళి, ప్రభాస్, రానా ఒక స్పెషల్ ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూతోనే సినిమాపై ఎపిక్ రిలీజ్ పై బజ్ ఏర్పరిచారు. ఇక నెక్స్ట్ బాహుబలి ఎపిక్ కోసం మళ్లీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లాంటివి ప్లాన్ చేస్తున్నారట. ఐతే ఈ ఈవెంట్ లో ప్రభాస్, రానా తో పాటు మిగతా చిత్ర యూనిట్ కూడా పాల్గొంటారని తెలుస్తుంది. ఐతే బాహుబలి ఎపిక్ ఈవెంట్‌కి అనుష్క వస్తుందా.. లేదా అన్న ప్రశ్న ఎదురైంది. అనుష్క సినిమాల విషయంలో చాలా గ్యాప్ తీసుకుంటూ వస్తుంది. బాహుబలి 2 తర్వాత ఆమె కేవలం 3 సినిమాలు మాత్రమే చేసింది. సినిమా సినిమాకు అనుష్క గ్యాప్ తీసుకోవడం కామన్ అయ్యింది. ఐతే రీసెంట్‌గా సెప్టెంబర్‌లో అనుష్క నటించిన ఘాటి సినిమా రిలీజైంది. ఈ రిలీజ్ టైంలో అనుష్క ప్రమోషన్స్‌లో పాల్గొనలేదు. అదేంటి సొంత సినిమా రిలీజ్ టైంలో బయటకు రాకపోవడం ఏంటని అందరు మాట్లాడారు. అనుష్క కండీషన్స్ అప్లై అన్న తర్వాతే సినిమాలు చేస్తుందని తెలుస్తుంది. ఐతే బాహుబలి ఎపిక్ ఈవెంట్‌కి అనుష్క వస్తుందని ప్రచారం జరుగుతుంది. ఘాటి ఈవెంట్‌కి రాని అనుష్క బాహుబలి కోసం వస్తుందా అన్న డిస్కషన్ మొదలైంది. ఫ్యాన్స్ ఎక్స్ పెక్ట్ చేయడంలో తప్పులేదు కానీ ఘాటి తన సోలో సినిమా. ఫిమేల్ సెంట్రిక్ సినిమాగా వచ్చిన ఆ సినిమా ప్రమోషన్స్‌కి అనుష్క నో చెప్పింది. తను లీడ్ లో నటించిన ఘాటి సినిమాకు రాని అనుష్క బాహుబలి కోసం వస్తుందా అనే డౌట్ మొదలైంది. అనుష్క వచ్చే ఛాన్స్ అసలు లేదు కానీ ఆమె గురించి మాత్రం సోషల్ మీడియాలో చర్చ జరుగుతుంది. బాహుబలి ఎపిక్ రిలీజ్ అని అనౌన్స్ మెంట్ చేసిన దగ్గర నుంచి అనుష్క ఈమధ్య సోషల్ మీడియాలో కూడా కనిపించట్లేదు. ఘాటి రిలీజ్ తర్వాత సోషల్ మీడియాకు కొంతకాలం దూరంగా ఉంటానని అనౌన్స్ చేసింది అనుష్క. మరి రాజమౌళి అనుష్కని బాహుబలి ఎపిక్ ఈవెంట్‌కి తీసుకొస్తాడా.. ప్రభాస్, రానాలతో అనుష్క ఈవెంట్‌లో పాల్గొంటుందా అన్నది తెలియాల్సి ఉంది.

# కొత్త సంవత్సరంలో డెకాయిట్.. రిలీజ్ ఎప్పుడంటే?



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్.. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉండగా.. అందులో ఒకటి డెకాయిట్. విభిన్నమైన కథలతో ఇప్పటికే ఆడియన్స్‌ను మెప్పించి సూపర్ హిట్లు అందుకున్న అడివి శేష్.. ఇప్పుడు డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి యాక్షన్ డ్రామాగా ఆ సినిమా రెడీ అవుతోంది. అడివి శేష్ హీరోగా ఇప్పటికే నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా వర్క్ చేసిన షనీల్ డియో.. ఇప్పుడు డెకాయిట్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతోనే ఆయన డైరెక్టర్‌గా పరిచయమవుతున్నారు. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ముందు ఫిమేల్ లీడ్ రోల్‌కు శ్రుతి హాసన్ అనుకున్నా.. ఆమె తప్పుకున్నారు. అయితే డెకాయిట్ మూవీ 2025 క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ కొన్ని రోజుల క్రితం అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్టే షూటింగ్ షెడ్యూల్ ను కూడా ప్లాన్ చేశారు. జెట్ స్పీడ్‌లో చిత్రీకరణ నిర్వహించాలని అనుకున్నారు. కానీ డెకాయిట్ షూటింగ్‌లోనే అడవి శేష్ ఇటీవల గాయపడడంతో చిత్రీకరణ వాయిదా పడింది. ఇంకా సినిమాకు సంబంధించిన కీలక సీన్స్‌ను షూట్ చేయాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పుడు గాయం నుండి కోలుకున్నా.. ప్రస్తుతం వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో షూటింగ్ మళ్లీ ప్రారంభమవ్వడానికి కాస్త సమయం పడుతుంది. దీంతో మేకర్స్ సినిమా రిలీజ్ ను వాయిదా వేశారు. క్రిస్మస్‌కు విడుదల చేయడం లేదు. తాజాగా సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఉగాది పండుగ కానుకగా మార్చి 19న రిలీజ్ చేస్తున్నామని అఫీషియల్‌గా మంగళవారం ఉదయం ప్రకటించారు మేకర్స్. ఆ సమయంలో స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. అందులో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ యాక్షన్ మోడ్‌లో కనిపించారు. ఓ యాక్షన్ సీన్స్‌కు సంబంధించిన పిక్‌గా తెలుస్తోంది. కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక సినిమా విషయానికొస్తే.. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్, యాక్టర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో డెకాయిట్‌తోనే ఆయన అరంగేట్రం చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. మరి కొత్త సంవత్సరంలో రానున్న డెకాయిట్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# ఫౌజీలో స్టార్ వారసుడు.. సూపర్ బజ్..!







స్టార్ వారసులకు సినీ ఎంట్రీ అనేది చాలా ఈజీ.. ఐతే వాళ్లు హీరో అయ్యే దాకా వెయిట్ చేయించి తెరంగేట్రం చేయించడం అనేది ఒక లెక్క ఐతే అలా కాకుండా చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిచయం చేసి అలా చిన్నగా ఆడియన్స్‌కు పరిచయం చేయడం మరో లెక్క అవుతుంది. స్టార్ హీరోల వారసులకు అది ఒక అడ్వాంటేజ్ అవుతుంది. ఐతే ఘట్టమనేని హీరో సుధీర్ బాబు తన తనయుడు దర్శన్‌ని చైల్డ్ ఆర్టిస్ట్‌గా కొనసాగిస్తున్నాడు. రెబల్ స్టార్ ప్రభాస్ ఫౌజీ సినిమా.. ఇప్పటికే అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో దర్శన్ కనిపించాడు. ఇప్పుడు ఒక క్రేజీ సినిమాలో కూడా దర్శన్ నటిస్తాడని తెలుస్తుంది. అది రెబల్ స్టార్ ప్రభాస్ ఫౌజీ సినిమా అని టాక్. హను రాఘవపూడి డైరెక్షన్‌లో 1930 నేపథ్యంతో భారీ బడ్జెట్ సినిమాగా వస్తుంది ఫౌజీ. ఈ సినిమా నుంచి రీసెంట్‌గా రిలీజైన ఒక ప్రీ లుక్ అదిరిపోయింది. ఫౌజీ సినిమాలో హీరో చిన్నప్పటి రోల్‌ని సుధీర్ బాబు తనయుడు దర్శన్ కనిపిస్తాడట. ఓ విధంగా దర్శన్‌కి ఇది గొప్ప అవకాశం అని చెప్పొచ్చు. ఫౌజీలాంటి సినిమా వల్ల పాన్ ఇండియా లెవెల్‌లో ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంటుంది. సుధీర్ వారసుడు స్క్రీన్‌కి బాగా అలవాటు పడేందుకే ఎలాంటి రోల్ వచ్చినా సరే చేస్తున్నాడు. సర్కారు వారి పాట సినిమాలో అతని లుక్స్‌కి ఆడియన్స్ ఇంప్రెస్ అయ్యారు. తనను తాను ప్రూవ్ చేసుకునే ఛాన్స్ కోసం.. ఇక ఫౌజీలాంటి సినిమాలో ఎలాగు మంచి పవర్ ఫుల్ రోల్‌తోనే కనిపిస్తాడు. ప్రభాస్ చిన్నప్పటి రోల్‌కి దర్శన్ అని అనగానే సుధీర్ బాబు అభిమానులు కూడా దర్శన్‌కి మంచి ఆఫర్ అంటూ డిస్కస్ చేస్తున్నారు. దర్శన్ కూడా తనను తాను ప్రూవ్ చేసుకునే ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. సుధీర్ బాబు ఎలాగు డిఫరెంట్ సినిమాలతో వస్తున్నాడు. ఆయన నటించిన జటాధర నెక్స్ట్ రిలీజ్ అవుతుంది. సుధీర్ బాబు వారసుడిని కూడా ఇలా సినిమాల్లోకే తెచ్చే ప్లానింగ్‌తో ఉన్నట్టు తెలుస్తుంది. అందుకే ఇప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్‌గా అతన్ని సుపరిచితుడిని చేసి హీరోగా అప్పటికి అంతా సెట్ రైట్ చేయాలని చూస్తున్నారు. ప్రభాస్ ఫౌజీలో దర్శన్ ఛాన్స్ అతన్ని మరింత ఆడియన్స్‌కు దగ్గరయ్యేలా చేస్తుందని చెప్పొచ్చు. సుధీర్ బాబు సపోర్ట్‌తో దర్శన్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని చూస్తున్నాడు. ఎలాగు మేనమామ ఆశీస్సులతో పాటు ఆయన ఇంటెన్స్ యాక్టింగ్ వారసత్వం తోడుడు వస్తుంది కాబట్టి దర్శన్ కచ్చితంగా ఆడియన్స్‌ని ఇంప్రెస్ చేస్తాడని చెప్పొచ్చు.

# శ్రీలీలలో మార్పు.. ఇష్టం లేకపోయినా సరే అలా..!



స్టార్ హీరోయిన్ శ్రీలీల నెక్స్ట్ మాస్ జాతరతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ధమాకా తర్వాత రవితేజ తో కలిసి శ్రీలీల చేసిన సినిమా ఇది. అందుకే ఈ సినిమా మీద చాలా హైప్ ఉంది. ఐతే మాస్ జాతరలో తనది ఒక ప్రత్యేకమైన పాత్ర అంటుంది అమ్మడు. మాస్ పాత్రలు చేయాలని ఉంటుంది కానీ తనకు అలాంటి రోల్స్ రావట్లేదని చెబుతుంది శ్రీలీల. ఇక ఈమధ్య తన లుక్‌లో మార్పుల వెనక సీక్రెట్ బయట పెట్టింది శ్రీలీల. లుక్ మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు.. వరుస స్టార్ సినిమాలతో బిజీ అయిన శ్రీలీల సరైన డైట్ పాటించక కాస్త బొద్దుగా మారింది. అంతేకాదు ఆమెకు అమ్మమ్మవాళ్లు చేసే అరిసెలు అంటే చాలా ఇష్టమట. ఒంగోలు నుంచి అరిసెలు వస్తే మొత్తం ప్యాకెట్ తినేదాకా లేచేది కాదట శ్రీలీల. ఐతే ఇప్పుడు అలా తినడం మానేసి తన లుక్ మీద చాలా ఫోకస్ చేస్తున్నట్టు చెప్పుకొచ్చింది శ్రీలీల. అందుకే ఈమధ్య అమ్మడు పూర్తిగా స్లిమ్ లుక్ అయ్యింది. ఫుడ్ విషయంలో కండీషన్స్ అప్లై చేసుకుంటున్నా.. ఒక డాక్టర్‌గా ఎలాంటి ఫుడ్ తీసుకుంటే బెటర్ అని తెలుసు కాబట్టి అలాంటి ఫుడ్ =తోనే మెయింటైన్ చేస్తున్నా అంటుంది శ్రీలీల. తనను చూడటానికి థియేటర్‌కి వచ్చే ఆడియన్స్‌కి బాగా కనిపించాలి కదా అంటూ తనలో ఈ మార్పు వెనక రీజన్ చెప్పింది శ్రీలీల. రవితేజ మాస్ జాతరలో శ్రీలీల నిజంగానే ప్రేక్షకులను ఇంప్రెస్ చేసేలా ఉంది. తెలుగులోనే కాదు బాలీవుడ్‌లో శ్రీలీల తెరంగేట్రం చేసింది. కార్తీక్ ఆర్యన్‌తో ఆమె చేస్తున్న సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత.. తెలుగులో టాప్ స్టార్స్‌తో నటిస్తున్న శ్రీలీల తనకు పోటీగా వస్తున్న భామలకు టఫ్ ఫైట్ ఇచ్చేందుకు ఇక మీదట గ్లామర్ రోల్స్ మాత్రమే కాదు అభినయానికి ప్రాధాన్యత ఉన్న రోల్స్ కూడా చేయాలని ఫిక్స్ అయ్యింది. ఐతే శ్రీలీల అనగానే ఆడియన్స్ అందరికీ ఆమె డాన్స్ మాత్రమే గుర్తొచ్చేలా చేసిన ఈ అమ్మడు లేటెస్ట్ స్లిం లుక్‌తో మరింత సర్ ప్రైజ్ చేస్తుంది. సౌత్ నుంచి బాలీవుడ్‌కి వెళ్లిన హీరోయిన్స్ చాలా తక్కువ ఉన్నారు. ఐతే శ్రీలీల మాత్రం తనకంటూ ఒక సెపరేట్ మార్క్ ఉండేలా చూస్తుంది. కార్తీక్ ఆర్యన్‌తో తొలి సినిమా సైన్ చేసిన అమ్మడు మరో రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్‌లో ఉన్నట్టు తెలుస్తుంది. శ్రీలీల అటు తమిళ్‌లో కూడా పరాశక్తి సినిమాలో ఛాన్స్ అందుకుంది. శివ కార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమాలో రవి మోహన్, అథర్వ మురళి కూడా నటించారు.

# "మొంథా" తుఫాను సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రావద్దు

### - విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను సమయంలో తీర ప్రాంతంలో ప్రజల్వెరూ బయటకు రావద్దని, మత్స్యకారులెవ్వరూ సముద్రంలోకి వేటకు వెళ్ళవద్దని, అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అక్టోబరు 27న కోరారు. పూసపాటిరేగ మండలం పతివాడ బర్రిపేట గ్రామంలో గల తుఫాను సహాయ కేంద్రంను, ఇతర తీరప్రాంత గ్రామాలను, మెరైన్ పోలీసు స్టేషన్ను విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సందర్శించి, స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. అనంతరం, సహాయ కేంద్రంలో ప్రభుత్వ సహాయక చర్యలను పర్యవేక్షించారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ మాట్లాడుతూ మొంథా తుఫాను సమయంలో తీరంలో 100కి.మీ.లకు పైబడి గాలులు వీస్తాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరమైతే తప్పా తుఫాను సమయంలో ప్రజలెవ్వరూ బయటకు రావద్దన్నారు. మత్స్యకారులెవ్వరూ సముద్రంలోకి వేటకు వెళ్ళవద్దని కోరారు. తుఫాను తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నందున అధికారుల సూచనలను ప్రజలు పాటించాలన్నారు. ప్రభుత్వ పరంగా రెవెన్యూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని, పోలీసుశాఖ పరంగా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. తీర ప్రాంత గ్రామాలను ఇప్పటికే అప్రమత్తం చేసామని, విపత్తులను ఎదుర్కొనేందుకు మెరైన్, ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంటు, ఎస్.డి.ఆర్.ఎఫ్. పోలీసు అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామని, ఎవ్వరూ అభద్రతాభావానికి గురికావాల్సిన పని లేదన్న భరోసాను విశాఖపట్నం రేంజ్ డిఐజి కల్పించారు. లోతట్టు ప్రాంతాల్లోను, పూరి గుడిసెల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు, సహాయక కేంద్రాలకు చేరుకోవాలన్నారు. తుఫాను ప్రభావం మూడు రోజులపాటు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు తమ విలువైన వస్తువులను భద్రపర్చుకోవాలని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి సూచించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ మొంథా తుఫాను తీవ్రంగా ఉంటుందని, తుఫాను తీరం చేరేంత వరకు మత్స్యకారులెవ్వరూ చేపల వేటకు వెళ్ళవద్దన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో రక్షణ చర్యలు చేపట్టేందుకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందన్నారు. తుఫాను ప్రభావంతో విద్యుత్, ఇంటర్నెట్, ఫోను కమ్యూనికేషను వ్యవస్థలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా ఉన్నతాధికారులకు అందిస్తే సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం, విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ చింతపల్లి మెరైన్ పోలీసు స్టేషను సందర్శించి, మెరైన్ అధికారులు, సిబ్బందితో మమేకమయ్యారు. తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, తీర ప్రాంతంలో తుఫాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని మెరైన్ పోలీసు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి వెంట జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, కోస్టల్ సెక్యూరిటీ అదనపు ఎస్పీ ఎ.వి.రమణ, విజయనగరం డిఎస్పీ ఆర్. గోవిందరావు, భోగాపురం రూరల్ సిఐ జి. రామకృష్ణ, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, కోస్టల్ సెక్యూరిటీ ఇన్స్పెక్టరు బి.వి.జె.రాజు, పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, మెరైన్ పోలీసులు, సిబ్బంది, ముక్కాం గ్రామస్థులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండాలి.. అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలి

### - రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ - కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో తుఫాను సన్నద్ధతపై సమీక్ష





**విజయనగరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తుఫాను కంట్రోల్ రూమ్ ను సందర్శించారు. తుఫాన్‌ను ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లపై సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని రకాల ముందస్తు చర్యలను తీసుకోవాలని కోరారు. పంట నష్టం జరగకుండా రైతులకు తగిన జాగ్రత్తలను తెలియపరచాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, వెంటనే పునరుద్ధరణకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. త్రాగునీరు, పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. తుఫాను వల్ల జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మంత్రికి వివరించారు. జిల్లాలో తుఫాను ప్రభావం పడే అవకాశం ఉన్న 69 గ్రామాలను ముందే గుర్తించామని, అక్కడి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 8 గ్రామ సచివాలయాల పరిధిలో ముందస్తు చర్యలను చేపట్టామని, పోలీసు సిబ్బందిని కూడా సిద్దంగా ఉంచామని చెప్పారు. పాఠశాలలు, తుఫాను భవనాలు తదితర 71 పునరావాస కేంద్రాలను సిద్దం చేశామని, ఆహార పదార్థాలు, మందులు తదితర అత్యవసరమైన వాటిని సిద్దంగా ఉంచామని తెలిపారు. వాగులు, గెడ్డలు, రిజర్వాయర్లు, నదుల్లో నిరంతరం నీటి మట్టాన్ని గమనిస్తూ, ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు.

ప్రసవానికి 10 రోజులు ఉన్న గర్భిణులను సైతం ఆసుపత్రికి తరలిస్తున్నారని కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సిపివో పి.బాలాజీ, డిపిఎం రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు విజయవంతం

### - విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఎన్నో ఉద్యమాలను నిర్వహిస్తున్న పి డి ఎస్ యు నేడు జరిగే రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి - విద్యాశాఖ మంత్రిని నియమించాలి







**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించుకోవడం జరిగింది. పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ 1972లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అరాచకాలకు, ర్యాగింగ్, కుల వివక్షతకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి, తన మిత్ర బృందంతో ఏర్పడిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. శాస్త్రీయ విద్యాసాధనకై, సమసమాజ స్థాపనకై కదులుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ అనేకమంది విద్యార్థులు తమ ప్రాణాలను ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కొరకు త్యాగం చేశారన్నారు. వారి త్యాగంతో ఎరుపెక్కిన బిగిపిడికిలి జెండా నేటికీ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తూనే ఉందన్నారు. ఈ క్రమంలోనే గత ఉద్యమాల సమీక్షకై, నూతన కర్తవ్యాలకై రాష్ట్ర మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 28, 29, 30 తేదీలలో జరుపుకోబోతున్నదని తెలిపారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం రాష్ట్ర నాలుగవ మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో 28, 29, 30 తేదీలలో కార్యవర్గం నిర్వహించుకోబోతున్నదన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి మంత్రిని కేటాయించే పరిస్థితి కనబడటం లేదని, రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ నేటికీ నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. గురుకులాలలో విష ఆహారం విద్యార్థులు మరణాల పాలవుతున్నారని, సంక్షేమ హాస్టల్స్, ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయంగా మారాయన్నారు.

సమస్య ఉత్పన్నమైయినప్పుడు మాత్రమే అధికారులు విద్యాలయాలను పర్యవేక్షించడం తప్ప పరిష్కరించిన పాపాన ఏ అధికారి, పాలకులు గాని లేరన్నారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ అని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని హామీకే పరిమితం చేసిందని, విద్యారంగా అభివృద్ధిలో గిరిజన ప్రాంతం అయినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంపదను తరలించుకోవడమే తప్ప ఇక్కడ యువతకు ఉపాధి కల్పించే ఆలోచనలోనే పాలకులు లేరన్నారు. రాష్ట్ర నాలుగవ మహాసభ జిల్లా విద్యార్థులు అదేవిధంగా మేధావులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతును తెలియ జేసి విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్ సంతోష్. నవ్య. లక్ష్మి. వెన్నెల. ప్రవళిక. అరుణ్. నవీన్ తదితరులు పాల్గొన్నారు

# తుఫాన్ సంసిద్ధతపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు - ప్రజల ప్రాణరక్షణే ప్రాధాన్యం






**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో తుపాన్ సంసిద్ధతపై చర్యలను స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి సోమవారం గంట్యాడ, ఎస్ కోట, ఎల్.కోట, జామి మండలాలలో సుడిగాలి పర్యటన జరిపి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా గంట్యాడ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్, విధుల కేటాయింపులో లోపాలను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కంట్రోల్ రూమ్‌లో సిబ్బంది విధులను సక్రమంగా కేటాయించాలని, వచ్చిన ఫిర్యాదులు నమోదు చేయడానికి ఒకరు, చేపట్టిన చర్యలు తెలియజేయడానికి ఒకరు చొప్పున ఇద్దరు సిబ్బందిని కేటాయించాలని, వారికి కేటాయించిన సమయంలో వారే విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులను వెంటనే పరిస్థితిని చక్కదిద్ది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఎల్.కోట మండల తహసీల్దార్ కార్యాలయం కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి తగు సూచనలు జారీ చేసారు. ఎస్ కోట, జామి మండల తహసీల్దార్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే ప్రాధాన్యంగా భావించాలని స్పష్టం చేశారు. అత్యధిక వర్షపాతం మరియు గాలులు వీచే పరిస్థితుల నేపథ్యంలో వల్నరబుల్ గ్రామాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

సిబ్బంది హాజరు, సమాచార సేకరణ మరియు సమన్వయం వంటి అంశాలపై సూచనలు జారీ చేశారు. ప్రతి కంట్రోల్ రూమ్ 24 గంటలు యాక్టివ్‌గా ఉండాలని, నిర్లక్ష్యం సహించబోనని హెచ్చరించారు.

# నారాయణ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులతో పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని రామలింగాపురం నందు గల నారాయణ కాన్సెప్ట్ స్కూల్లో సోమవారం పేరెంట్ స్టూడెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. 1, 2వ తరగతి స్టూడెంట్స్ సెగ్మెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమం స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులు మొదటి టర్మ్‌లో నేర్చుకున్న వంటి అంశాలను తమ తల్లిదం డ్రుల ముందు ప్రదర్శించడం.

అలాగే పేరెంట్స్ స్వయంగా విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులు Teaching Learning Material (TLM) సహాయంతో సమాధానాలు అం దించడం అన్నారు. ఈ విధంగా, విద్యార్థులు నేర్చుకున్న విష యాలను సృజనాత్మకంగా ప్రదర్శించగా, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల అభ్యాస ప్రక్రియను దగ్గరగా గమనించే విధంగా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ Parent-Student Interaction ప్రోగ్రామ్‌ను సెంట్రల్ ఆఫీస్ నుండి నారాయణ గ్రూప్ డైరెక్టర్ పొంగూరు రమాదేవి నేతృత్వంలో పర్యవేక్షణ బృందం పర్యవేక్షించింది. ఈ కార్యక్రమంలో 1 మరియు 2 వ తరగతి విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంగళరావు, సోనీ, ECHAMPS వైస్ ప్రిన్సిపాల్స్ వెన్నెల, సల్మ EKidz వైస్ ప్రిన్సిపాల్ బిందు మరియు ఏవో శివ రంజిత్ పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించబడింది.

# తీర ప్రాంత ప్రజలను పునరావసు కేంద్రాలకు తరలించిన ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర తీరం ప్రాంత ప్రజలతో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి సమావేశమై అవగాహన కల్పించారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గచ్చకాయల పొర, సిర్ర యానాం, నీళ్ళరేవు, పల్లం, పల్లంకుర్రు, బలుసుతిప్ప తదితర గ్రామాలలో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుతో కలిసి పర్యటించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించిందనీ ఈ మేరకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందన్నారు. జిల్లా అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసి తుఫాన్ హెచ్చరికలపై తగు చర్యలు, జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని గ్రామస్తులకు వివరించారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. జిల్లాలో 441 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తగు మందులు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేసిందన్నారు.

అలాగే ప్రజలు అధికారులకు సహక రించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు ఏర్పాటు చేసిన పునరవాస కేంద్రాలను ఎంపీ హరీష్ బాలయోగి ఎమ్మెల్యే సుబ్బరాజులు పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

# తుఫానును ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధం

**- నష్ట నివారణకు ముందుజాగ్రత్త చర్యలను చేపట్టాం - సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామస్థాయిలో అప్రమత్తత - పునరావాస కేంద్రాలను, ఆహార పదార్ధాలను సిద్దం చేశాం - పూరిపాకల్లో వారిని సురక్షిత చోట్లకు తరలిస్తున్నాం : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**



**విజయనగరం, (రాజధాని వార్తలు):** మోంథా తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అప్రమత్తంగా ఉన్నామని అన్నారు. ఆయన సోమవారం తమ ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ తుఫాను సన్నద్ధతను వివరించారు. రేపు మోంథా తుఫాను కాకినాడ వద్ద తీరాన్ని తాకే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వరుసగా మూడు రోజులపాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తూ, యంత్రాంగానికి ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాలో తుఫాను ప్రభావం పడే అవకాశం ఉన్న 69 గ్రామాలను ముందే గుర్తించామని, అక్కడి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 8 గ్రామ సచివాలయాల పరిధిలో ముందస్తు చర్యలను చేపట్టామని, పోలీసు సిబ్బందిని కూడా సిద్దంగా ఉంచామని చెప్పారు. పాఠశాలలు, తుఫాను భవనాలు తదితర 71 పునరావాస కేంద్రాలను సిద్దం చేశామని, ఆహార పదార్ధాలు, మందులు తదితర అత్యవసరమైన వాటిని సిద్దంగా ఉంచామని తెలిపారు. వాగులు, గెడ్డలు, రిజర్వాయర్లు, నదుల్లో నిరంతరం నీటి మట్టాన్ని గమనిస్తూ, ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు. నిండుగా ఉన్న రిజర్వాయర్లలో ముందుజాగ్రత్త చర్యగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. గండ్లు పడే అవకాశం ఉన్నచోట ఏఈలకు పర్యవేక్షణా బాధ్యతలను అప్పగించామన్నారు. పంటనష్టం కలగకుండా పంటలను బట్టి వ్యవసాయ శాఖాధికారులచేత సూచనలు అందిస్తున్నామన్నారు. విద్యాసంస్థలకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించామని, సంక్షేమ వసతిగృహాల పిల్లలను బయటకు వదలకుండా చూడాలని సూచించామన్నారు. చెట్లు, కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నందున, వాటిని వెంట వెంటనే తొలగించేందుకు జెసిబిలు, పవర్ సా తదితర పరికరాలను సిద్దంగా ఉంచామని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు, సబ్ స్టేషన్లలో అదనపు సిబ్బందిని సైతం సిద్దంగా ఉంచామని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సుమారు 60 మంది గజ ఈతగాళ్లను గుర్తించి సిద్దం చేశామని చెప్పారు. ప్రసవానికి 10 రోజులు గడువు ఉన్న గర్భిణులను సైతం ముందుజాగ్రత్తగా ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. మత్స్యకారులంతా సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, అందరూ ప్రస్తుతం తమ గ్రామాల్లోనే ఉన్నారని సమాచారం వచ్చిందని కలెక్టర్ వివరించారు.

# కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన అంబేద్కర్ కోనసీమ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, (రాజధాని వార్తలు):** ఇటీవల జరిగిన కర్నూలు వద్ద హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్లే ప్రైవేటు బస్సు ప్రమా దం జరిగి అందులో మంటలు చెలరేగి సుమారు 19 మంది చనిపోగా మిగిలిన వారు గాయాలు పాలయ్యారు. చనిపోయిన 19 మందిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం మండలం రావులపాలెం గ్రామానికి చెందిన కొవ్వూరు శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. శ్రీనివాస్ రెడ్డి హైదరాబాదులో క్రేన్ ఆపరేటింగ్ వర్క్ చేస్తారు. ఏదో ఒక పని నిమిత్తం బెంగళూరు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈరోజు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెంలోని శ్రీనివాస్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని ఆయన అన్నారు. ఈ ప్రమాద ఘటనలో చనిపోయిన వారికి ఐదు లక్షలు ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. కనీసం ఒక కుటుంబానికి 25 లక్షలు చొప్పున ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం. ఒక ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమి ఈ ప్రభుత్వం తీసుకోవట్లేదనీ ప్రమాదం జరిగిన తర్వాత మాత్రం 289 బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఆ శాఖ అధికారులు తెలుపుతున్నారని అన్నారు. ఇది ఏ విధంగా ఉంది అంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోవ డంలా ఉంది ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగవు కదా అని ఆయన అన్నారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా ఆదేశాల మేర 289 ట్రావెల్ బస్సులపై అధికారులు నమోదు చేస్తే అందులో అగ్నిమాపక పరికరాలు లేని బస్సులు 103, రవాణా చట్టాన్ని లెక్కచేయకుండా తిరుగుతున్న బస్సులు 18, అత్యవసర ద్వారం లేని బస్సులు 13, అసలు సరైన పత్రాలు లేని బస్సులు 127 ఉన్నాయని స్వయంగా ఆంధ్రజ్యోతి పత్రిక లోనే ప్రచురించారు. అలాగే ప్రతి ఆరు నెలలకి ఒకసారి జరగ వలసిన రోడ్డు భద్రత సమావేశాలు జరపలేదని కూడా పత్రికలో ప్రచురించారు. అధికారులు ప్రైవేట్ బస్సులు యాజమాన్యంతో చేతులు కలిపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, రాత్రి ఒంటిగంట వరకు బెల్ట్ షాపులు నడిపి ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నారని ఆయన అన్నారు.


# ఎన్డీయే కూటమి శ్రేణులు, జనసైనికులు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి

**- రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా మీకు తోడుగా ఉంటుంది : ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**



**పి.గన్నవరం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ తీవ్రతరం కావడంతో రాబోవు రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం నుంచే వర్షాలు కురుస్తుండగా.. భారీగా గాలులు వీస్తాయని, అధిక వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎన్డీయే కూటమి శ్రేణులు, జనసైనికులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గంలో లంక ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఎవరూ అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అయినవిల్లి మండలం కొండు కుదురు లంక, అయినవిల్లి లంక, వీరవల్లిపాలెం లంక గ్రామాల్లో పర్యటించి గ్రామస్థులకు భరోసా కల్పించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు అన్ని శాఖలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పూరి గుడెసల్లో ఉండేవారు సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాలని కోరారు. ఎళ్ళవేలలా మీకు అందుబాటులో ఉంటానని తుఫాను విషయంలో ఎవరూ అధైర్య పడవద్దని లంక ప్రాంత వాసులకు ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు.

# శ్రీశ్రీశ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన ఊరేగింపు మహోత్సవంలో మన సిరమ్మ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ధర్మపురిలోని పతివాడ వీధిలో శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపన ఊరేగింపు ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్. ఆర్.సీ.పి.జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ సోమవారం సాయంత్రం గం!! 05.00 లకు శ్రీ అభయ గణపతి ప్రతిష్టాపనా ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచాగ్రవ్య ప్రాసన, పరిషత్ గోపూజా తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ముఖ్యనాయకులు, గ్రామ ప్రజలు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితాల నుండి తొలగించాలి



**చర్ల, (రాజధాని వార్తలు):** చర్ల మండలం అంబేద్కర్ సెంటర్ నందు చర్ల మండల జేఏసీ చైర్మన్ కోరం సూర్యనారాయణ వైస్ చైర్మన్ కంగాల.అభి కార్యదర్శి కారం నరేష్, ఆదివాసి సంక్షేమ పరిషత్, తుడుం దెబ్బ, గోండ్ వాన సంక్షేమ పరిషత్, నాయక్ కోడ్, ఉపాధ్యాయుల సంఘం, మూలవాసి, మానవ హక్కుల పరిరక్షణ వేదిక, ఉద్యమకారులు, వివిధ రాజకీయ,ఉద్యమకారుల ఆధ్వర్యంలో చలో ఎటునగరం నవంబర్ 3న చట్టబద్ధతలేని లంబాడీలను ఎస్టి జాబితా నుంచి తొలగించాలని పోస్టర్లను రిలీజ్ చేసి చర్ల ఆదివాసి గ్రామాలు గుడాల నుంచి భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొనాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోడెమ్ విజయ్ రావు,శ్యామల రామారావు, తోకల లక్ష్మీపతి, గుర్రం వీరభద్రం, బెండబైనా సర్వేశ్వరరావు, కనితి మురళి, సోడి ప్రదీప్ అల్లూరి వారు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీను గుండి చిట్టిబాబు గొంది శోభన్ బాబు తాటి శ్రీను పోడియం వెంకటేశ్వర్లు కారం సురేష్ పాండురాజు తుర్రం నాగరాజు పాల్గొనడం జరిగినది.

# సింహాద్రి అప్పన్న భూములకు కూటమి ప్రభుత్వం ఎసరు?



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** గ్రేటర్ విశాఖపట్నంలో అత్యంత విలువైన సింహాద్రి అప్పన్న దేవస్థాన భూములు మరో సారి వివాదానికి కేంద్రబిందువుగా మారాయనీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా బింగి హరికిరణ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ భూములను ఏపీఐఐసీకి బదిలీ చేయడానికి సన్నాహాలు చేస్తోందని అని అడివివరం, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న సుమారు 257 ఎకరాల దేవస్థాన భూములు, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దాదాపు 9,000 కోట్లకు పైగా అంచనా ఉన్నట్లు ఈ భూములను పరిశ్రమల అభివృద్ధి పేరుతో ఏపిఐఐసికి బదిలీ చేయాలనే ఫైళ్ళు వేగంగా కదులు తున్నాయని తెలిపారు. దానికి ప్రతిగా ప్రభుత్వం గాజువాక ప్రాంతంలో 3,000 కోట్ల విలువైన భూములను సింహాచలం దేవస్థానానికి ఇవ్వాలని ప్రతిపాదించినదని వెల్లడించారు..దీంతో తీసుకునేది 9,000 కోట్ల విలువైన భూములు - ఇచ్చేది మాత్రం 3,000 కోట్ల భూములేనని విమర్శించారు. సింహాద్రి అప్పన్న దేవస్థాన భూములను ఇలా బదిలీ చేయడం పాపమని,దేవస్థాన ఆస్తులపై ఇంత పెద్ద అన్యాయం జరుగుతుంటే విశాఖ ప్రజలు చూస్తూ ఊరుకోరని కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దీని మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని వైస్సార్సీపీ పాలనలో దేవస్థాన భూములను కాపాడేందుకు పలు చర్యలు తీసుకున్నామని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ముఖ్య ఆస్తుల బదిలీ పేరుతో అమ్మకానికి పెట్టడం దారుణం అని ఎన్నికల సమయంలో సింహాచలం పంచ గ్రామాల భూ సమస్యలు తీరుస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, ఎన్నికలయ్యాక ఇటువంటి దారుణానికి పూనుకోవడం అన్యాయమని అన్నారు తక్షణమే ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# మొంథా తుఫాన్ తీవ్ర తుఫానుగా మారుతుంది

**- అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలి - డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి**



**కొత్తపేట, (రాజధాని వార్తలు):** బంగాళాఖాతంలోని తీవ్రవాయుగుండంలో మొంథా తుఫాను తీవ్రమైన తుఫానుగా బలపడింది. దీని ప్రభావంతో ఈదురు గాలులు మరియు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రాంతవాసులు అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. ముఖ్యంగా రైతు సోదరులు వారి పొలాల వద్ద ఉన్న కరెంటు మీటర్లు మరియు కరెంటు వైర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, స్కూలు సెలవులు కారణంగా పిల్లల ప్రమాదకరమైన చోటికి వెళ్లకుండా సురక్షితమైన చోటే ఉండాలని ఆయన అన్నారు. మరియు అలాగే పూరిగుడిసెల్లో ఉన్నటువంటి వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని ఆయన కోరారు. ముఖ్యంగా1996లో వచ్చినటువంటి తుఫాను అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రాణ నష్టం గాని, ఆస్తి నష్టం గానీ జరగకుండా అధికారులు ఇచ్చిన కంట్రోల్ నెంబర్‌ని దగ్గర ఉంచుకోవాలని కోరారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం





**అమలాపురం, (రాజధాని వార్తలు):** బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సందర్శించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరం మండలం కోటిపల్లిలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కోటిపల్లి పుష్కర ఘాట్లను, రేవును ఆనుకుని ఉన్న వీధులలో తిరిగి ప్రజలను అప్రమత్తం చేశారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండడంతో ప్రజలంతా ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు రక్షిత మంచి నీరు, ఆహారం, పాలు, తగిన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను సంబంధిత సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్‌కి తెలియజేసి సహాయం పొందాలని సూచించారు. ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభు త్వం ముందస్తుగా అన్ని రక్షణ చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు తుఫాను సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారన్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉందని అశ్రద్ధ వద్దని, ప్రజల భద్రతే ముఖ్యమన్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ సెలవులు రద్దు చేయడం జరిగిందన్నారు. గతంలో వచ్చిన హుద్ హుద్, తిథలి తుఫాన్ల అనుభవంతో ఎలాంటి నష్టం జరగకుండా యుద్ధ ప్రాతిపదికన తగు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, స్థానిక కూటమి నాయకులు, వెంటూరి వీర్రాఘవులు, కోటిపల్లి సర్పంచ్ పేమ్మాడి బేబీ సత్తిబాబు, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, కంచుమర్తి బాబురావు, యువ నాయకులు, గొడవర్తి రామకృష్ణ చీకట్ల సోమేష్, చీకట్ల రాము, కోటిపల్లి మత్స్యకార సొసైటి ప్రెసిడెంట్ ఓలేటి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్ అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి : తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు

**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** మండలంలో మొంథా తుపాన్ నేపద్యంలో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని మండల తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మొంథా తుపాన్ ముంచుకొస్తున్న నేపద్యంలో పలుచోట్ల ముంపు ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. ముంపు ప్రాంతా లలో నివాసం ఉంటున్న వారిని పునరావస కేంద్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఏడు చోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులను అప్రమత్తం చేశామన్నారు. పెన్నా పరివాహక ప్రాంతాల్లో మరమ్మత్తులకు గురైన పొర్లు కట్టలు మరమ్మత్తులు చేశామన్నారు. సోమశిల జలాశయం నుండి పెన్నా నదికి సుమారు లక్ష క్యూసెక్కులు నీరు విడుదల చేయడం జరిగిందన్నారు. పెన్నానదిలో వరద ఉధృతి ఎక్కువ ఉండడం నేపద్యంలో ఇసుక తవ్వకాలకు ఎవ్వరు వెళ్ళవద్దని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడతామన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారు



లతో సమన్వయం చేసుకోని నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని తహసిల్దారు కార్యాలయంలో 24 గంటలు అధికారులు ఉంటారని ఆయన తెలిపారు.

# ఉప్పలంకలో తుఫాన్ పునరావాస కేంద్రం ఏర్పాటు



**కరప, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ ప్రభావంతో ముంపు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్న కరప మండలం, ఉప్పలంక గ్రామ ప్రజల సురక్షిత నివాసం కోసం ప్రత్యేక పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ఆయన తనయుడు పంతం సందీప్ సోమవారం తుఫాన్ షెల్టర్ వద్ద ఏర్పాటైన కేంద్రాన్ని స్వయంగా పరిశీలించారు. సందీప్ పర్యటన సందర్భంగా తహశీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ ఇప్పటికే తరలించిన కుటుంబాల సంఖ్య, కేంద్రానికి చేరుకునే ప్రజల వివరాలు, ఆహారపానీయాల సరఫరా వంటి అంశాలపై పూర్తి వివరాలు సేకరించారు. మొంథా తుఫాన్ తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం ఉప్పలంక గ్రామంలో ప్రత్యేక తుఫాన్ షెల్టర్ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు. ప్రజల సురక్షిత నివాసం కోసం రెవెన్యూ, పంచాయతీ, వైద్య, విద్యుత్, పోలీసు శాఖల సమన్వయంతో త్రాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు, ఆహారం వంటి ప్రాథమిక సదుపాయాలను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. తుఫాన్ తీవ్రత పెరిగిన సందర్భంలో మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలను సురక్షితంగా ఉప్పలంక తుఫాన్ షెల్టర్ కేంద్రానికి తరలించే ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

# పారదర్శకంగా మద్యం దుకాణాల టెండర్ లక్కీడ్రా

**రాజన్న సిరిసిల్ల, (రాజధాని వార్తలు):** మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ స్పష్టం చేశారు. జిల్లాలో 2025- 2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం షాపుల టెండర్ల ఓపెన్ డ్రా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 48 దుకాణాలు ఉన్నాయని, వాటిలో గౌడ్లకు 9, ఎస్సీలకు 5 రిజర్వేషన్ ప్రకారం కేటాయించామని వెల్లడించారు. సెప్టెంబర్ 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్లు స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు ఈ నెల(అక్టోబర్) 23వ తేదీ వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1381 వచ్చాయని వెల్లడించారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రాధాకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan